# తనకోపమే తన మిత్రుడు

రతన్



రంగారావు బ్యాంకు నుండి మధ్యాహ్నం లంచ్‌కి ఇంటికొచ్చాడు. భార్య అన్నం పెట్టడానికన్నా ముందు ఒక ఉత్తరం చేతిలో పెట్టింది. రంగారావు చెల్లెలు రాయక రాయక రాసిన ఉత్తరమది. ఆత్రంగా విప్పి చదివాడు.

తనకు మొగపిల్లవాడు పుట్టాడని-కానీ పుట్టేటప్పుడు తిథి, నక్షత్రాలు మంచివి కాని కారణంగా శాంతి చెయ్యాల్సివొస్తుందని, లేనట్లయితే మేనమామకు కీడని, ఆ శాంతి కూడా మేనమామే జరిపించాలని సిద్ధాంతులు నొక్కి వొక్కాణించి చెప్పారని, కనుక వెంటనే బయల్దేరి రావల్సిందని రంగారావుకు చెల్లెలు రాసిన ఉత్తరంలోని సారాంశం.

రంగారావుకు విపరీతమైన కోపమొచ్చింది. తనకు పిల్లలు పుడితే తనకే ఖర్చు! చివరికి తన చెల్లెలికి పిల్లలు పుట్టినా ఖర్చు తనకే! ఇంటి ప్రక్కవాళ్ళకు పిల్లలు పుట్టినా తనకే ఖర్చు! (బాలసారె ప్రెజంటేషన్ తీసుకెళ్ళకపోతే పెళ్ళాం వూరుకోదు) 'వెధవ! పుట్టే వెధవ కాస్త మంచి ఘడియల్లో పుట్టి ఏడవకూడదూ!' అనుకుని కోపంతో గొణుక్కున్నాడు.

మామూలు రోజుల్లో అయితే రంగారావుకి అంత కోపం రాకపోయేది. కానీ నెలాఖరు రోజులు. శాంతి గీంతి అంటే ఎట్లా లేదన్నా వెయ్యో, పదిహేను వొందలో కావాలి. నెలాఖరున ఎక్కడి నుంచి వొస్తాయి?

కోపంతోనే ఆలోచిస్తూ పెళ్ళాం వంటా, వొడ్డింపు అన్నీ బాగానే చేసినా-అనవసరాల్ని అవసరాలుగా మలిచి పెళ్ళాన్ని నాలుగు తిట్టి-తిండి సరిగ్గా తినకుండానే కొద్దో గొప్పో కడుపు నిండగానే చెయ్యికడుక్కుని లేచి పోయాడు. పెళ్ళానికి ఆకస్మికమైన ఈ పరిణామంలోని ఆంతర్యం అర్థం కాలేదు.

ఆఫీసలో అడుగుపెడుతూనే ప్యూన్‌మీద విరుచుకు పడ్డాడు. కుర్చీలో కూర్చోకుండానే ఒక అకౌంటెంట్ మీద విరుచుకుపడ్డాడు.

సీట్‌లో కూర్చున్నాక విరుచుకు పడడానికి ఎవ్వరూ దొరక్క, 'ఛీ ఛీ! వెధవ బ్యాంకు, వెధవ స్టాఫ్! ఒక్కడికీ వర్క్‌రాదు-డిసిప్లిన్ లేదు-ఒక్కొక్కడినీ డిస్‌మిస్ చేసిపారెయ్యాలి' అనుకుంటూ అందరినీ హోల్‌సేల్‌గా తిట్టడానికి ఉపక్రమించబోతుండగా స్ప్రింగ్ డోర్ నెట్టుకుంటూ ఒక వ్యక్తి లోపలికొచ్చాడు.

దాంతో రంగారావుకు మరికాస్త మండింది. ''ఏయ్! ఎవరయ్యా నువ్వు? ఏం కావాలి? అడక్కుండా చొరబడి రావడమేనా-ఆఁ! పో, బైటికి పో...''

''క్షమించండి-కొంచెం అర్జంటు పనుండి వచ్చాను''.

''ఏంటి...ఏంటంత అర్జంటుపని?'' కసురుకున్నాడు రంగారావు.

''కోళ్ళఫారమ్ పెట్టుకోవడానికి నాకు లోన్ శాంక్షన్ చేశారుకదా! మొదటి పార్ట్ పేమెంట్‌తో షెడ్ వగైరా, అన్నీ పూర్తయ్యాయి. సెకండ్ పార్ట్ పేమెంట్ కూడా ఇప్పిస్తేవెంటనే ఫారం ప్రారంభిస్తాను.''

''ఇదిగో నీ మీద చాలా రిమార్క్ వుంది. నువ్వు షెడ్-గిడ్ ఏమీ కట్టలేదట. ఫస్ట్ పేమెంట్ అంతా వాడుకు దొబ్బావట-సెకండ్ పేమెంట్ లేదు ఏం లేదు. ముందు ఫస్ట్ పేమెంట్ డబ్బుకట్టు-నాటకమాడుతున్నావ్-నాటకం...''

''షెడ్ వేశాను. మీరిచ్చిన డబ్బంతా ఫారంమీదే ఖర్చు పెట్టాను. కావాలంటే ఒచ్చి చూడండి.''

''నాకివ్వేమీ చెప్పక్కర్లేదయ్యా-నా మాటంటే మాటే! ఇవ్వనంటే ఇవ్వను!! ఇస్తేగిస్తే రెండు నెల్ల తర్వాత చూద్దాం వెళ్ళు! ఒక్కొక్కడికి బ్యాంకు సొమ్మంటే ఏదో తేరగా వుంది. ఇప్పుడేం కుదరదు వెళ్ళు...''

''అంతా సిద్ధం చేసుకున్నాక ఇప్పుడీమాట అంటే ఎట్లాసార్...చూడండి కొంచెం...''

''కొంచెం లేదు గించెం లేదు వెళ్ళవయ్యా-నీకే చెప్పేది...అబ్బబ్బ చంపేస్తున్నారు-ఫో-బైటికి ఫో...''

ఒచ్చిన కస్టమర్ మారుమాట్లాడకుండా టేబుల్ మీద ఐదొందలు పెట్టి ''రేపొస్తాను. ఏదో విధంగా పని జరిగేట్లు చూడండి'' అని ఇంకో మాటకు అవకాశమివ్వకుండా బైటికెళ్ళిపోయాడు.

డబ్బు టేబిల్ మీద కొచ్చేసరికి కోపం కొంచెం తగ్గింది. డబ్బుతీసి జేబులో పెట్టుకున్నాడు. ఇంతలో వెంటనే ఒక మెరుపు లాంటి ఆలోచన వొచ్చింది-దాంతోపాటే కోపం తారస్థాయినందుకుంది.

మరో కస్టమర్ లోపలికొచ్చి ఏదో చెప్పబోయి రంగారావు కోపానికి-తిట్లకి బలైపోయాడు. తత్ఫలితంగా బల్లమీదికి మరో ఐదొందలు చేరింది.

సాయంత్రం వరకూ రంగారావు కోపం ఏ మాత్రం తగ్గలేదు. బ్యాంక్‌లో స్టాఫ్ అంతా ఆశ్చర్యపోయారు-ఎన్నడూ లేనిది ఏంటి ఈ వైపరీత్యమని.

దూర్వాసుడిలా బ్యాంకుకు వెళ్ళిన రంగారావు ఆనందంగా ఇంటికి వొచ్చాడు. రాగానే ''రేపు రాత్రికి మా చెల్లెలి వాళ్ళ వూరు వెళ్తున్నాం మనం-బట్టలు సర్ది వుంచు. రేపే ప్రయాణం'' అన్నాడు రంగారావు భార్యతో.

''నెలాఖరు కదా-ఎట్లావెళ్తాం-ఊరికే వెళ్ళిరావడం కూడా కాదు. ఖర్చుతోకూడినపని- అప్పుతెచ్చారా ఎక్కడైనా...''

''లేకపోతే లేదని ఏడుపు—వుంటె ఎక్కడిదని ఏడుపు. ఎక్కడో తెచ్చి చచ్చానుగాని-రేపటికి రెడీఅవు'' మధ్యాహ్నంనుంచీ విరుచుకుపడడం అలవాటై-పెళ్ళాం మీద కూడా విరుచుకుపడబోయి తమాయించుకున్నాడు. రంగారావుకు ఒక పద్యం గుర్తొచ్చింది...

''తనకోపమె తన శత్రువు...ఛీ, ఛీ-తన మిత్రుడు'' అని మార్చేశాడు. ●